# శ్రీ లక్ష్మీనృసింహ మంగళా శాసనం

**1.శ్రీ యాదగిరి శృంగాగ్ర గుహామధ్య విహారిణే**

**సర్వలోకేశ్వరాయాస్తు శ్రీ నృసింహాయ మంగళం ||**

తాత్: శ్రీ యాదగిరి శిఖరాగ్రమునయున్నట్టి గుహామధ్యమున సమస్త భోగములతో నిత్య నివాసము చేయుచున్న సమస్తలోకములకు అధినాథుడైన శ్రీ లక్ష్మీనృసింహ స్వామికి మంగళమగుగాక

**2.వామాంక విలసల్లక్ష్మీ బంధవే లోకబంధవే**

**సూరి భోగ్యాయ యాదాద్రి శ్రీ నృసింహాయ మంగళం ||**

తాత్: వామాంకమున నిత్యనివాసము చేయుచున్న లక్ష్మీదేవికి ప్రీతిపాత్రుడైనటువంటి వాడును, లోకమునకు బంధువైనటువంటివాడును, నిత్యసూరులు మొదలగువారికి భోగ్యస్వరూపుడును ఐనట్టి శ్రీ లక్ష్మీనృసింహునికి మంగళమగుగాక

**3.శంఖ చక్ర ప్రభా మధ్య రాజద్విమల మూర్తయే**

**శ్రీ యాదగిరివాసాయ శ్రీ నృసింహాయ మంగళం ||**

తాత్: ఉభయ హస్తముల యందు శంఖ చక్రములతో ప్రకాశించునట్టి సుందరమైన విగ్రహముకలవాడు, యాదగిరి యందు నిత్య నివాసము చేయునట్టి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామికి మంగళమగుగాక

**4.గుహా నివసనాత్సర్వ హృద్గుహావాస సూచనం**

**కుర్వతే సర్వలోకానాం యాదాద్రీశాయ మంగళం ||**

తాత్: "భగవంతుడు సమస్త ప్రాణుల హృదయములనెడి గుహల యందు ఎల్లప్పుడు నివసించునని" వేదశాస్త్ర పురాణాదులయందు వర్ణించబడిన విషయము. ఈ విషయమును లక్ష్మీ నృసింహుడు యాదగిరి యందలి గుహలో తాను స్వయముగా నివసించుచూ మనందరకును ప్రకటింపజేయుచున్నాడా యని తోచును. అటువంటి స్వామికి మంగళమగుగాక

**5.నిత్యాయ నిరవద్యాయ నిత్యవైభవశాలినే**

**నిత్య వైభవ దాత్రేచ శ్రీనృసింహాయ మంగళమ్||**

తాత్: నిత్య స్వరూపుడును, నిరవద్యుడును, ఎల్లప్పుడు సర్వైశ్వర్యములతో తులదూగుచున్నవాడు, భక్తులకు నిత్య వైభవములనిచ్చువాడును ఐన శ్రీలక్ష్మీనృసింహునికి మంగళమగుగాక

**6.సాధులోక శరణ్యాయ కామితార్థ ప్రదాయినే**

**ఆర్తార్తి హరణాయాస్తు శ్రీనృసింహాయ మంగళం ||**

తాత్: సత్పురుషులకు శరణ్యుడును, కోరిన కోర్కెలను తీర్చువాడు, ఆపదలలోనున్నవారి ఆపదలను నివారించు వాడును అయిన శ్రీలక్ష్మీనృసింహస్వామికి మంగళము కలుగుగాక

**7.భుక్తి ముక్తి ప్రదాత్రేచ శక్తి భక్తి ప్రదాయినే**

**నిర్వాణ సుఖ రూపాయ శ్రీ నృసింహాయ మంగళమ్||**

తాత్:మానవాళికి ఆహారము,ముక్తిని ఇచ్చి, శక్తిని భక్తిని కలుగజేసి, సుఖముగా మోక్షమును ప్రసాదించు శ్రీలక్ష్మీనృసింహునికి మంగళమగుగాక

8.జగత్కర్త్రే జగత్భోక్త్రే జగద్వ్యాపాయ వేదసే
జగతాంచ నివాసాయ యాదాద్రీశాయ మంగళం ||
తాత్: సృష్టికి కారకుడును, జగత్తును అనుభవించువాడును, జగత్తుతో తెలియబడువాడును, ప్రపంచమున నివసించువాడును అగు యాదాద్రీశునకు మంగళమగుగాక

9.అనేక కోటి బ్రహ్మాండై: కందుకా క్రీడ లీలయా
కేళీవిలాస లోలాయ శ్రీ నృసింహాయ మంగళం ||
తాత్: అనేక కోటి బ్రహ్మాండములతో బంతిని ఆడుకొను రీతిగా కేళీ విలాస లోలుడగు శ్రీలక్ష్మీనృసింహునికి మంగళమగుగాక

10.సురాసుర నరానాంచ వానరానాం చ పక్షినాం
దీనానాం రక్షకాయాస్తు శ్రీనృసింహాయ మంగళమ్||
తాత్: దేవతలను, రాక్షసులను, మానవులను, వానరులను, పక్షులను, మరియు దీనులను రక్షించువాడగు శ్రీలక్ష్మీనృసింహునకు మంగళమగుగాక

11.దుష్టానాం నిగ్రహం చైవ శిష్టానాం పరిపాలనం
యుగపత్ కుర్వతే లక్ష్మీనరసింహాయ మంగళం ||
తాత్: "దుష్ట శిక్షణ, శిష్టజన పరిపాలనము" అను కార్యములను తన అధ్బుతములైన శక్తి సామర్ధ్యములతో వెనువెంటనే నిర్వహించు శ్రీలక్ష్మీనృసింహునికి మంగళమగుగాక

12.ప్రపంచ వృక్ష బీజాయ నిష్ప్రపంచాయ మాయినే
మాయాపనోదకాయాస్తు శ్రీనృసింహాయ మంగళం ||
తాత్: ప్రపంచమనే వృక్షమునకు బీజము వంటివాడు, ప్రపంచాతీతుడు, ప్రకృతి శక్తులకు ప్రభువు, మాయామోహముల పారద్రోలువాడైన శ్రీలక్ష్మీనృసింహునికి మంగళమగుగాక

13.సంతాన దాన దీక్షాయ సంతానాయ ఫలార్తినాం
కౌసల్యా ముఖ్య సంతానరూపిణే శుభ మంగళం ||
తాత్: సంతాన ఫలమును అపేక్షించు వారికి సంతాన ఫలమును ప్రసాదించువాడు కౌసల్యా దేవి యొక్క ముఖ్య సంతానమైన శ్రీ రామచంద్ర స్వరూపుడైన శ్రీలక్ష్మీనృసింహస్వామికి మంగళమగుగాక

14.మంగళం నరసింహాయ మంగళం గుణసింధవే
మంగళానాం నివాసాయ యాదాద్రీశాయ మంగళం ||
తాత్: శ్రీ లక్ష్మీనృసింహ స్వామికి మంగళమగుగాక. సౌశీల్య , సౌలభ్య, వాత్సల్యాది గుణములకు సముద్రునివంటి స్వామికి మంగళమగుగాక. మంగళములకు నివాసభూతుడైన యాదగిరి లక్ష్మీనృసింహ స్వామివారికి నిత్యము మంగళమగుగాక

శ్రీ లక్ష్మీనృసింహ మంగళాశాసనం సమాప్తం